క్లుప్తంగా...

ఢిల్లీ పోలీసులకు దొరికిన 'నేపాలీ ముఠా' దొంగ

బంగారు నగలు–నగదు స్వాధీనం


నిందితుడు భరత్ బిస్తా

రాంగోపాల్‌పేట్: పీజీరోడ్‌లోని రాహుల్ గోయల్ ఇంట్లో లూటీకి పాల్పడిన నేపాలీ గ్యాంగ్‌లో మరో నిందితుడు ఢిల్లీ పోలీసులకు చిక్కాడు. ఢిల్లీ పోలీసుల నుంచి నిందితున్ని అదుపులోకి తీసుకున్న రాంగోపాల్‌పేట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 9వ తేదీన రాహుల్ గోయల్ ఇంట్లో సుమారు రూ.5 కోట్ల విలువైన బంగారు, వెండి నగలు, నగదు దోచుకుని ఓ నేపాలీ ముఠా పారిపోయిన సంగతి తెలిసిందే. ఈ పాటికే రాంగోపాల్‌పేట్ పోలీసులు 9 మంది నిందితులను అరెస్టు చేసి కొంత నగదును స్వాధీనం చేసుకోగా..4వ నిందితుడైన పాత నేరస్తుడు.. పుణే బార్‌లో వెయిటర్‌గా పనిచేసే భరత్ బిస్తా (23) అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ నెల 22వ తేదీన పట్పర్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో భరత్ బిస్తా అనుమానాస్పదంగా తిరుగుతుండగా తేజ్‌పాల్ అనే కానిస్టేబుల్ అదుపులోకి తీసుకోగా హైదరాబాద్‌లో దొంగతనం గురించి చెప్పాడు. దీంతో అక్కడి పోలీసులు అదే రోజు అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరు పరిచారు. రాంగోపాల్‌పేట్ పోలీసులకు సమాచారం అందించడంతో నిందితున్ని నగరానికి తీసుకుని వచ్చారు. నిందితుడి నుంచి వంద గ్రాముల బంగారు బిస్కెట్, 5 బంగారు నాణేలు, 4 మెటల్ చైన్లు, ఒక ఉంగరం, 215.80 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి నాణేలు, రూ.22,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్ ప్రకాష్‌నగర్‌లోని ఏ–2 నిందితుడు లాల్‌సింగ్ ఇంట్లో ఉన్న 50 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసికుని నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: బేగంపేట ప్రభుత్వ మహిళ డిగ్రీ కాలేజీలో వివిధ సబ్జెక్టులను బోధించేందుకు పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అర్హత గల వారు ఈ నెల 26 (నేడు) దరఖాస్తు చేసుకోవాలని, 27న ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

వారంలో ప్రొ.అన్సారీకి రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించండి

మైనార్టీ కమిషన్ ఆదేశాలు జారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఐదు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ప్రొ.అన్సారీకి వారం రోజుల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ జాప్యంపై ప్రొ.అన్సారీ మైనార్టీ కమిషన్‌ను ఆశ్రయించగా మంగళవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ మైనార్టీ కమిషన్ ఎదుట హాజరయ్యారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మైనార్టీ కమిషన్ అధికారులు వారం రోజుల్లో ప్రొ.అన్సారీకి రావాల్సిన పింఛన్, ఇతర బెనిఫిట్స్ ఇవ్వకుంటే తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

నాగులూరితో మందకృష్ణమాదిగ భేటీ



చిలకలగూడ: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబాను చిలకలగూడలోని స్వగృహంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరి క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్న సాయిబాబాను కలవడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

నగ్న చిత్రాలతో మాజీ భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: భార్య భర్త లుగా ఉన్న సమయంలో తీసిన నగ్న చిత్రాలతో మహిళను వేధిస్తున్న వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ మహిళ (33) సాధిక్ (35) ఉద్యోగ రీత్యా గతంలో సౌదీ అరేబియాలో ఉన్నప్పుడు 2012లో అక్కడే వివాహం చేసుకున్నారు. మనస్పర్థల కారణంగా విడిపోయి అక్కడే విడాకులు తీసుకున్నారు. సదరు మహిళ ఇండియాకు వచ్చేందుకు ప్రయత్నించగా రాకుండా అడ్డంకులు సృష్టించాడు. కలిసి ఉన్న సమయంలో తీసుకున్న నగ్న చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించాడు. తప్పించుకుని నగరానికి వచ్చిన ఆమె సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాధిక్ నగరానికి వచ్చిన సమయంలో విమానాశ్రయంలోనే అరెస్టు చేసి జైలుకు పంపారు. బెయిల్‌పై వచ్చిన అతడు మళ్లీ వేధింపులకు గురిచేస్తుండటంతో ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

27న దళితబంధు రెండో విడత లబ్ధిదారుల ఎంపిక సమావేశం

సనత్‌నగర్: దళితబంధు రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన సమావేశం ఈ నెల 27న (రేపు) మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో జరుగనుంది. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఎస్సీ, బీసీ కార్పొరేషన్లకు చెందిన జిల్లా అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. దళితబంధు లబ్ధిదారుల ఎంపిక, బీసీలకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాలపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. హోంమంత్రి మహమూద్ అలీ, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.


అధికారులతో సమావేశమైన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


మంత్రిని కలిసిన ఆర్డీఓ రవికుమార్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

సనత్‌నగర్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడా కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో నెలకొన్న పరిస్థితులు, అందుతున్న సహాయక చర్యలపై అధికారులతో ఆరా తీశారు. బల్కంపేటలోని ఎల్లమ్మ దేవాలయంలోకి నీరు చేరిందని తెలుసుకుని యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశాలతో ఆలయ పరిసరాలలో నిలిచిన, ఆలయంలోకి చేరిన నీటిని తొలగించారు. అదే విధంగా అమీర్‌పేట డివిజన్‌లోని బుద్ధానగర్, గంగుబాయిబస్తీ, బేగంపేటలోని బ్రాహ్మణవాడీ, మయూరిమార్గ్‌లలోనూ నిలిచిన వర్షపు నీటిని తొలగించారు.

● సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ఎన్‌వీ రత్నం, సికింద్రాబాద్ ఆర్డీఓగా నూతనంగా బదిలీపై వచ్చిన రవికుమార్ వేర్వేరుగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎన్‌టీపీసీ సేవలు అభినందనీయం

బన్సీలాల్‌పేట్: ఎన్‌టీపీసీ అధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శానిటరీ వెండింగ్ మెషిన్, ఇన్సినరేటర్‌లను పంపిణీ చేశారు. కవాడిగూడ ప్రధాన రహదారిలోని ఎన్‌టీపీసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్‌టీపీసీ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేబాశిష్ ఛటోపాధ్యాయ, ముషీరాబాద్ మండల డిప్యూటీ డీఈఓ చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా దేబాశిష్ ఛటోపాధ్యాయ మాట్లాడుతూ.. ఎన్‌టీపీసీ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. చదువే అన్ని సమస్యలను పరిష్కరిస్తుందని చదువు ద్వారానే పేదల జీవితాల్లో వెలుగు, అభివృద్ధి చూడగలమని పేర్కొన్నారు. డిప్యూటీ డీఈఓ చిరంజీవి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల సౌకర్యార్థం ఎన్‌టీపీసీ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.


శానిటేషన్ యంత్రాలు అందజేసిన ఎన్‌టీపీసీ అధికారులు

కార్పొరేటర్ సమీక్ష సమావేశం

బౌద్ధనగర్: సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ముమ్మర చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. మంగళవారం బౌద్ధనగర్‌లోని వార్డు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ ఉమర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ

మెక్లోడ్‌గూడ, నల్లగుట్టలో కార్పొరేటర్ పర్యటన

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని ఎందుకు ఏర్పాటు చేయడం లేదని స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ప్రశ్నించారు. మంగళవారం ఆమె డివిజన్‌లోని మెక్లోడ్‌గూడ, నల్లగుట్ట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. భారీ వర్షానికి చెత్తా చెదారం, బురద సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అక్కడికి బురద, చెత్తను తొలగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అన్ని డివిజన్లలో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేశారని కానీ.. రాంగోపాల్‌పేట్‌లో మాత్రం బీజేపీ కార్పొరేటర్ ఉన్నారనే కారణంతో కార్యాలయం ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. దీనిపై జోనల్ కమిషనర్‌తో మట్లాడేందుకు వారం రోజుల నుంచి అపాయింట్మెంట్ అడుగుతున్నా ఇవ్వడం లేదని, ఉప కమిషనర్ స్పందించడం లేదని వాపోయారు.


మెక్లోడ్‌గూడలో బురదను తొలగిస్తున్న సిబ్బంది

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

చిలకలగూడ: మణిపూర్‌లో రెండు జాతుల మధ్య జరుగుతున్న అల్లర్లను నివారించాలని, సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేయాలని సీపీఎం సికింద్రాబాద్ జోన్ ప్రతినిధి మహేందర్ డిమాండ్ చేశారు. చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద మంగళవారం సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన చేపట్టారు. కేంద్రంతోపాటు మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని, అల్లర్లను అదుపు చేయలేని బీరేన్‌సింగ్ తక్షణమే సీఎం పదవికి రాజీనామా చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు సికింద్రాబాద్ జోన్ ప్రతినిధులు మహేందర్, మధు, ఎల్లస్వామి, నర్సింగ్, సురేష్, నరేందర్, రవి, రాజు, సయ్యద్, వెంకటేష్ పాల్గొన్నారు.

త్వరలోనే జీహెచ్ఎంసీలోకి కంటోన్మెంట్: పీఎల్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సమ్మతంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత పీఎల్ శ్రీనివాస్ తెలిపారు. కంటోన్మెంట్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత పీఎల్ శ్రీనివాస్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ విలీనం అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిపారు. సీఎంతో దాదాపు ముప్పయి ఏళ్ల అనుబంధం కలిగిన ఆయన, కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం ద్వారా ఇక్కడి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే కంటోన్మెంట్ విలీనానికి ఆమోదం తెలిపిన నేపథ్యంలో వీలైనంత త్వరలోనే కంటోన్మెంట్ జీహెచ్ఎంసీలో అంతర్భాగం అవుతుందని పీఎల్ ఆశాభావం వ్యక్తం చేశారు.


ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన పీఎల్ శ్రీనివాస్

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి


శిబిరంలో మాట్లాడుతున్న రంగారావు

సనత్‌నగర్: గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చేసి ప్రాణం కాపాడవచ్చని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఎస్.రంగారావు పేర్కొన్నారు. బేగంపేట టీటీఐలో మంగళవారం టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు ఆధ్వర్యంలో ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఆముక్త బృందం నేతృత్వంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారావు మాట్లాడుతూ.. పోలీసులు శాంతి భద్రతలు, ట్రాఫిక్ విధులు, రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించడమే కాకుండా అనుకోని పరిస్థితుల్లో గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ అందించి వారి ప్రాణాలను నిలబెట్టే ప్రాణదాతలుగా మారాలన్నారు.

విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలి

రసూల్‌పురా: ఆర్‌కేపురం ఆర్మీ స్కూల్‌లో మంగళవారం బ్రిలియంట్ అవెనీర్–విద్యాప్రవేశ్ అంశంపై ఓరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఏఓసీ కమాండెంట్ బ్రిగేడియర్ ఎఎ. దేశ్‌పాండే, ఆయన సతీమణి అనూజా దేశ్ పాండే ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రిగేడియర్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. దేశానికి సముచిత స్థానం కల్పించేందుకు విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజాసింగ్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న బ్రిగేడియర్ దేశ్‌పాండే

పరామర్శ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ సుభాష్ చంద్రబోస్‌నగర్ బస్తీ నాయకుడు అశోక్ ఆకస్మిక మృతి పట్ల డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశరావుగౌడ్ అశోక్ కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంత్యక్రియల్లో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, పలు పార్టీలకు చెందిన నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

నాలా పరీవాహక ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లోని నాలా పరీవాహక ప్రాంతాల్లో మంగళవారం కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మరో రెండు రోజులపాటు కొనసాగుతాయని వాతావరణశాఖ తెలిపిన నేపథ్యంలో నాలా పరీవాహక, లోతట్టు ప్రాంతవాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను పరిశుభ్రం చేయించాలని అధికారులను కోరారు. భవానీనగర్, కిందిబస్తీ, ఫ్రైడే మార్కెట్, శ్రీనివాసనగర్, షాబాద్‌గూడ, మేహ్మద్‌గూడ తదితర ప్రాంతాల వాసులతో మాట్లాడారు. సమస్యలను తన దృష్టికి తెస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని సామల హేమ హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, తదితరులు ఉన్నారు.

రైలుకింద పడి ఆత్మహత్య


మృతుడు

అడ్డగుట్ట: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. లాలాగూడ నుంచి మౌలాలి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం మధ్యలోని పట్టాలపై సోమవారం రాత్రి సుమారు 40–45 ఏళ్ల మధ్య వయస్సున్న ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు నలుపు రంగు ప్యాంట్, బ్లూ చెక్స్ తెలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


హరి

అడ్డగుట్ట: ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై దయాకర్ వివరాల ప్రకారం.. తుకారంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్స్ చెందిన బి.హరి (38) ఈ నెల 24న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభినందనలు


దామోదర రాజనరసింహకు శుభాకాంక్షలు తెలుపుతున్న రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: టీపీసీసీ ఎన్నికల కమిటీ సభ్యుడిగా నియమితులైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహకు కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానున్నదని, రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో మోదీ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారన్నారు.

డివైడర్ తొలగింపునకు వినతి

రసూల్‌పురా: తిరుమలగిరి లాల్‌బజార్ మహాత్మాగాంధీ కమ్యూనిటీహాల్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్‌ను తొలగించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు పి. శ్యాంకుమార్, నార్త్‌జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రంగారావు, తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ పురుషోత్తంరావును కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్ వద్ద రోడ్డును మూసేసి డివైడర్ ఏర్పాటు చేయడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పరిసర కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించగా సానుకూలంగా స్పదించారన్నారు.


ట్రాఫిక్ సీఐ పురుషోత్తంరావుకు వినతిపత్రం ఇస్తున్న శ్యాంకుమార్

'సంతాన లేమికి ఆధునిక జీవన శైలి కూడా కారణమే'


ఏఐ ఆధారిత ఆర్ఐ విట్‌నెస్ సిస్టమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ నటి ప్రణీత

కంటోన్మెంట్: ఆధునిక జీవనశైలి కారణంగా సంతాన లేమి సమస్య తీవ్రమవుతోందని సినీనటి ప్రణీత అన్నారు. సికింద్రాబాద్‌లోని ఫర్టీ–9 ఫర్టిలిటీ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఆర్ఐ విట్‌నెస్ సిస్టమ్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. సంతాన సాఫల్యత రంగంలో ఫర్టీ–9 ఆధునిక పరిజ్ఞానంతో ఎన్నో విజయాలు సాధిస్తోందని మారుతున్న జీవన శైలి, వాతావరణ మార్పులు, పెరిగిన ఒత్తిడి తదితర కారణాలతో సంతాన లేమి సమస్య ఏర్పడుతోందన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా సంతాన సాఫల్యత పొందవచ్చని సూచించారు. ఫర్టీ 9 ఫర్టిలిటీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ.. సంతాన లేమితో బాధపడుతున్న మహిళలకు కృత్రిమ గర్భధారణ పద్ధతుల వల్ల ప్రయోజనం కలుగుతోందన్నారు. వరల్డ్ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ఏఐ ఆధారిత ఆర్ఐ విట్‌నెస్ సిస్టమ్‌ను ప్రారంభించామన్నారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

రైల్వే ఎస్పీ షేక్ సలీమా

అడ్డగుట్ట: నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రైల్వే ఎస్పీ షేక్ సలీమా అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న షేక్ సలీమా, ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్పీ డెబస్మిత బెనర్జీ మాదారు. రైల్వే స్టేషన్లు, రైళ్లలో అక్రమ రవాణాలు, చోరీలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే గంజాయి అక్రమ తరలింపును అదుపు చేసి పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుంటూ నేరస్తులపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రైళ్ల ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ప్రయాణికుల భద్రతే తమ బాధ్యతగా నిరంతరం శ్రమిస్తామన్నారు. రైల్వే స్టేషన్లలో దొంగతనాలు, రైళ్లలో గంజాయి అక్రమ రవాణాలను అరికట్టేందుకు తనిఖీలను ముమ్మరం చేస్తామన్నారు. ఈ సమావేశంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు, ఎక్సైజ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సలీమా, డెబస్మిత బెనర్జీ

మణిపూర్‌లో పరిస్థితులు సద్దుమణగాలని ప్రార్థనలు

రాంగోపాల్‌పేట్: మణిపూర్‌లో ప్రస్తుతమున్న పరిస్థితులు సద్దుమణగాలని క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ, సోషల్ డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ అప్‌లిఫ్‌మెంట్, గాస్పల్ టీవీ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం సికింద్రాబాద్ ఎస్డీరోడ్డులోని మిలీనియం మెథడిస్ట్ చర్చిలో జరిగిన ఈ ప్రార్థనల్లో తెలంగాణాలోని వివిధ జిల్లాల నుంచి క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. మణిపూర్‌లో ఎంతో మంది క్రైస్తవులు చనిపోయారని, మహిళలు, చిన్నపిల్లలను కూడా హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో చర్చిలను కూడా తగులబెట్టారని కానీ బయటకు వచ్చినవి మాత్రం కొన్ని మాత్రమే ఉన్నాయని అన్నారు. మణిపూర్‌లో నాటి గుజరాత్‌లో మారణహోమం ఎలా చేశారో అదే వ్యక్తులు, సమూహాలు ఇక్కడ కూడా అదే తరహా చేస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బిషప్ సింగం, బిషప్ దుర్గం ప్రభాకర్, బిషప్ జాన్సన్, బొజ్జా శామ్యుల్, సతీష్, వినయ్ జాన్ పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ ప్రముఖులు

శేషాపహాడ్‌లో..

అడ్డగుట్ట: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు మరెక్కడా జరగరాదని దేవుడిని ప్రార్థిస్తున్నానని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నోముల ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. శేషాపహాడ్‌లోని క్రీస్తు ప్రత్యక్షత పరిచర్యలు చర్చిలో మంగళవారం పాస్టర్స్ ఫెలోషిప్‌లో భాగంగా జరిగిన సమావేశంలో మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు తగ్గుముఖం పట్టాలని, దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రార్థన చేశామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చర్చిలో ఒక ఆధ్యాత్మిక వాతావరణం ఉందని, ఇందులోకి ఎవ్వరు వచ్చినా, ఏ ఉద్దేశంతో వచ్చినా మంచి ఆలోచనలు కలిగేలా ఈ ప్రాంగణం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ నేతలు సురేష్ లాల్, జగ్గు, ఎంఆర్ శ్రీనివాస్, వేణు గౌడ్, లక్ష్మణ్, శివ, వహీద్, బబ్లు, చర్చి అధ్యక్షుడు పాస్టర్ జెకబ్, రాజేంద్ర ప్రసాద్, అరుణ్ కుమార్, భూషణం, యోన, నిరీక్షణ, శేఖర్ పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379